# ఊసికి

— అపర్ణా నైటింగేల్

ఆ నలుగురు రిటైర్డు ఆఫీసర్లు ఆ గదిలో మందు పార్టీ చేసుకుంటున్నారు. విస్కీ వెచ్చగా, చేదుగా . వాళ్ళ గొంతుల్లోకి దిగుతోంది. మందులోకి ఆధరువుగా చికెన్ ఫ్రై పీసెస్ నంజుకుంటున్నారు.

"ఓ కథ చెప్పవోయ్ రామ్మోహన్‌రావ్" అడిగాడు రిటైర్డ్ డి.ఎస్.పి సింహప్రసాద్.

"అవును, ఓ మంచి కథ చెప్పు" వంత పాడారు మిగతా ఇద్దరూ. వారిలో ఒకరు దేశ్‌పాండే- రిటైర్డ్ నేవీ కమాండర్, మరొకరు రాజశేఖర్ గుప్తా- రిటైర్డ్ ఇంజనీర్.

"ఇప్పుడు నాకు మూడ్ లేదు" అన్నాడు రామ్మోహనరావు.

"తప్పించుకోవాలని ప్రయత్నం చెయ్యకు, కథ చెప్పాల్సిందే" పట్టుబట్టాడు దేశ్‌పాండే.

"అవును. నువ్వు కథ చెప్పి తీరాల్సిందే!" సింహప్రసాద్, రాజశేఖర్ గుప్తాలు కూడా పట్టుబట్టారు.

రామమోహనరావు షిప్‌యార్డ్‌కి అనుబంధ సంస్థగా ఉన్న ఒక కంపెనీలో సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. అతడో మంచి రచయిత. సర్వీసులో ఉన్నప్పుడు యాక్సిడెంట్‌లో అతడి కుడి కాలు పోయింది. ఉద్యోగానికి పనికి రాడని కంపెనీ అతడిని ఉద్యోగంలో నుంచి తీసేసింది. అది మొదలు అతడు ఇంటివద్దనే కాలం గడుపుతున్నాడు.

"కథ చెప్పక తప్పదా?" అడిగాడు రామమోహనరావు.

"అవును. తప్పదు చెప్పి తీరాల్సిందే!" ముగ్గురూ ఏక కంఠంతో అన్నారు.

రామమోహనరావు ఓ నిమిషం పాటు మౌనం పాటించి గొంతు సవరించుకుని కథ చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు.

* * *

టీ అండ్ టీడి షేన్ కంపెనీ చాలా పెద్ద ఫ్యాక్టరీ. ఆ ఫ్యాక్టరీలో ఓడలకు సంబంధించిన మెషినరీ పార్టులు తయారవుతుంటాయి. అందుకుగాను ఆ ఫ్యాక్టరీకి సెక్యూరిటీ ఎక్కువగా ఉంటుంది. అహర్నిశలూ ఆ ఫ్యాక్టరీని సెక్యూరిటీ గార్డులు, చీఫ్ ఇన్‌స్పెక్టర్లు పహారా కాస్తుంటారు.

రాంబాబు, ప్రసాదరావు, వీర్రాజు, చటర్జీ- వాళ్ళు నలుగురూ సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. ఈ నలుగురే కాక ఇంకా చాలా మంది సెక్యూరిటీ గార్డులు, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్స్ కూడా ఆ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. అయితే ఈ నలుగురూ సెక్యూరిటీ గార్డులుగా ఒకే షిఫ్టులో పనిచేస్తుండేవారు.

ఆ రోజు నైట్ డ్యూటీ! రాంబాబు, ప్రసాదరావు, వీర్రాజు, చటర్జీ నలుగురూ డ్యూటీ ఎక్కారు.

"రాంబాబూ! నువ్వూ, వీర్రాజూ యార్డంతా ఓసారి చెక్‌చేసి రండి!" చెప్పాడు సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ మెహతా.

"ఓ.కె. సార్" అన్నారిద్దరూ వినయంగా.

ఇద్దరూ ముందుకు అడుగులు వేశారు.

"మంద ఎక్కువయితే మజ్జిగ చేటు అన్నట్టు" ఆ కంపెనీకి సెక్యూరిటీ గార్డులు ఎక్కువ మంది ఉండడం వల్ల ఎప్పుడూ వాళ్ళలో వాళ్ళే డ్యూటీ విషయాలలో కీచులాడుకుంటూంటారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు చాడీలు చెప్పుకుంటూంటారు. ఆ చాడీలు పర్సనల్ విషయాలు దాకా వెళ్ళిపోతుంటాయి.

ఇద్దరూ గన్స్ భుజాన వేసుకుని యార్డు అంతా అటూ ఇటూ పరికించి చూస్తూ నడుస్తున్నారు.

"రాంబాబు! ప్రసాదరావుకి నీ భార్య తెలుసట!" చెప్పాడు వీర్రాజు.

రాంబాబు ఆశ్చర్యపోయాడు.

"ఎలా తెలుసు?" అడిగాడు రాంబాబు అయోమయంగా.

"నీ భార్య, నువ్వు కోర్టులో గొడవలు పడ్డారు కదా! ఆ నేపథ్యంలో ప్రసాదరావుగాడి దూరపు బంధువెవరో నీ భార్య తాలూకు చుట్టాలమ్మాయిని మ్యారేజ్ చేసుకున్నాడట! వాడు, వీడు మాట్లాడుకుంటున్నప్పుడు వాడు నీ గురించి అడిగాడట? ఈ ప్రసాదరావుగాడు, వాడి ద్వారా నీ భార్యని కలిసి నీ ఆఫీసు గుట్లు అన్నీ అవిడకు చెబుతున్నాడు... అంతేకాదు, నీ భార్య చాలా మంచిదని, అనుమానించి నువ్వే వదిలేశావని మన గార్డులందరికీ అవాకులూ, చవాకులూ చెబుతున్నాడు" అన్నాడు వీర్రాజు.

రాంబాబు బాధపడ్డాడు.

నిజానికి రాంబాబు భార్య విషయంలో అతడి తప్పేమీ లేదు. ఆమె ప్రవర్తన మంచిది కాదని, పెళ్ళికి ముందే అతడి భార్యకు, ఆమె మేనమామకి సంబంధముండేది. రాంబాబు పెళ్ళి అయ్యాక కూడా అతడి భార్య మేనమామ దగ్గరకే వెళ్ళి కడుపు తెచ్చుకుంది. పైగా రాంబాబుని విషం ప్రయోగించి చంపాలని చూసింది. అంతే! దాంతో రాంబాబు ఆమెనొదిలేశాడు. ఆమె కోర్టుకెళ్ళి, జడ్జికి లంచం కట్టి రాంబాబు జీతంలో ప్రతీ నెలా మూడవ వంతు భరణం ఆమెకు వచ్చేలా చేసుకుంది. రాంబాబు చచ్చినట్టు ప్రతీనెలా ఆమెకు భరణం కడుతున్నాడు.

"ఆఫీసంతా నీ గురించే కోడై కూస్తోంది. అంతేకాదు... ప్రసాదరావు గాడికి నీ భార్యకి కూడా సంబంధం వుందని ఆఫీసంతటితోనూ చెబుతున్నాడు"

రాంబాబు మరింత బాధపడ్డాడు.

"అదొక్కటే కాదు రాంబాబూ! నీకు మగతనం లేదని, నీ భార్య వాడితో చెప్పిందట! ఇది వాడు అందరితోనూ చెబుతున్నాడు" చెప్పాడు వీర్రాజు. రాంబాబు మరింత బాధపడ్డాడు. కానీ,

తన బాధని బయటపడనియ్యకుండా పేలవంగా నవ్వాడు.

"ఆ ప్రసాదరావుగాడు వాడి పెళ్ళాన్ని వాడు సరిగ్గా చూసుకోలేడు. ఇంకొకడు పెళ్ళానికి వడేదుస్తున్నాడు. అసలు ప్రసాదరావుగాడిని వాడి పెళ్ళాం సరిగ్గా చూడదట! వాడి బట్టలు కూడా ఉతకదట! అంతెందుకు వాడి మాటకు కూడా విలువనియ్యదట! పైగా ఎవడితో పడితే వాడితో సినిమాలకి షికారులకి వీడిని పట్టించుకోకుండా వెళ్ళిపోతోందట! మరి దానికి ఎవ్వరున్నారో ఏమిటో?" చెప్పాడు వీర్రాజు.

ప్రసాదరావు భార్య కూడా తిరుగుబోతని వీర్రాజు చెప్పేసరికి రాంబాబు మనస్సు కొద్దిగా ఊరట చెందింది.

"చెడపకురా చెడేవు అంటే ఇదే! నా భార్య విషయంలో వాడు నన్ను చెడపాలని చూస్తే, వాడి భార్య విషయంలో వాడే చెడిపోయాడన్న మాట!



"గుడ్!" అంటూ తన హర్షాన్ని వెలిబుచ్చాడు రాంబాబు.

* * *

మర్నాడు నైట్‌డ్యూటీలో....

"రాంబాబూ! చటర్జీ! మీరిద్దరూ యార్డులో అంతా చెక్ చేసిరండి" ఆజ్ఞాపించాడు సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్.

"యస్‌ఆర్" అని ఇద్దరూ ముందుకు కదిరారు.

"రాంబాబూ! నీకీ విషయం తెలుసా?" అన్నాడు బెనర్జీ.

"ఏవిషయం?" కుతూహలంగా అడిగాడు రాంబాబు.

"మన వీర్రాజు విషయం"

"ఏమిటది?"

"వీర్రాజుకి భార్యంటే తగని అనుమానట! వాడిని చూస్తున్నావు, వీడిని చూస్తున్నావు" అంటూ అనుమానంతో తెగ వేధించుకు తింటాడట!

భార్యకు సరిగా తిండి కూడా పెట్టడట! ఎప్పుడు చూసినా వేపుడు కూరలు, మజ్జిగన్నం-ఇవే పెడతాడట భార్యకి! వీడి వల్ల వీడి భార్య చాల కష్టాలు పడుతోంది. ఆమె ప్రతినెలా ఫస్ట్‌తారీఖున జీతం అందుకోగానే ఆ డబ్బు బ్యాంకులో వేసేసుకుంటాడట." చెప్పాడు బెనర్జీ.

"ఈ విషయాలన్నీ నీకెలా తెలుసు"? అడిగాడు రాంబాబు.

"ఈ మధ్యనే వాడి పెళ్లాం ఓ కాలేజీ లెక్చరర్‌కి ఎటాచ్ అయిపోయింది. ఆ లెక్చరర్ నా స్నేహితుడు. వాడేయిదంతా చెప్పాడు" అన్నాడు బెనర్జీ".

ఆ మాటవిని రాంబాబు ఆశ్చర్యపోయాడు. ఎంచేతంటే వీర్రాజుది లవ్‌మేరేజ్! యార్డులోనే క్లర్క్‌గా పని చేస్తున్న ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు వీర్రాజు.

"ఏమిటో ఈ ఫ్యామిలీ తగువులు! నాకేమీ అర్థం కావడం లేదు. ఒకడి మీద ఇంకొకడు పెళ్లాల గురించి ఆఫీసుల్లో ఎందుకు చాడీలు చెప్తకుంటారో అర్థం కాదు. హాయిగా డ్యూటీ విషయాలు చర్చించుకోకుండా ఇలా ఫేమిలీస్ గురించి ఎందుకు మాట్లాడుకుంటారో తెలియడంలేదు". నొచ్చుకుంటూ అన్నాడు రాంబాబూ.

"ఇది సమాజం రాంబాబూ! మనం కళ్ళు మూసుకొని పాలు తాగుతున్నా కల్లే తాగుతున్నామనుకుంటుంది".

"నా భార్య గురించి, నా ఆఫీసు విషయాలు దానికి ప్రసాదరావుగాడు చేరవేస్తూన్నాడని, నా భార్యని వాడుకూడా వాడుకుంటున్నాడని మన గార్డులందరికీ పనికట్టుకుని మరీ చెబుతున్నాడని నిన్న వీర్రాజు నాతో చెప్పాడు. ఇపుడు నువ్వేమో వీర్రాజు పెళ్లాం ఎవడో లెక్చరర్‌కి ఎటాచ్ అయిపోయిందంటున్నావు. నిన్న వీర్రాజు నాతో మరో విషయం కూడా చెప్పాడు. ఆ ప్రసాదరావుగాడి పెళ్లాం కేరక్టరు కూడా మంచిది కాదట, అది కూడా తిరుబోతేనట!" అన్నాడు రాంబాబు.

"అవును బాసూ, ప్రసాదరావుగాడి భార్య గురించి కూడా ఆనోటా, ఈనోటా నేనూ చెడ్డగానే విన్నాను" అన్నాడు చటర్జీ.

రాంబాబు ఆలోచనలో పడ్డాడు. చెరపకురా చెడేవు అంటే ఇదే!


ఒకడి భార్యని మరొకడు చెరిపితే వాడి భార్యని ఇంకొకడు చెరవుతాడు. ఎంత చిత్రం! మరెంత విచిత్రం!

"అయినా రాంబాబూ! మనగార్డులకి పనీపాట వుండవు. "కుక్కమీద పిల్లి పడిందని, పిల్లి మీద ఎలక పడిందని", వాడిపెళ్లాం గురించి, వీడి పెళ్లాం గురించి చెప్పకుంటూరు. తప్ప-ఇంట్లో వాళ్ల పెళ్లాలని సరైన చెప్పచేతల్లో పెట్టుకోలేడు." జాలిగా రాంబాబుని చూస్తూ అన్నాడు చటర్జీ.

రాంబాబు మాట్లాడలేదు.

"కానీ నీ విషయమే నాకు బాధగా వుంది రాంబాబూ! కనీసం వాళ్ల భార్యలు ఎలాంటి వెధవ పనులు చేసినా ఇంకా మొగుళ్లనే పట్టుకొని ఏడుస్తున్నారు. మరి నీ భార్య నిన్నెందుకు ఇలా వదిలేసి వెళ్ళిపోయిందో అర్థం కావడం లేదు" జాలిగా అన్నాడు చటర్జీ.

"చేసుకున్నవాడికి చేసుకున్నంత మహాదేవా అని నేను గతజన్మలో అసలు పుణ్యం చేయలేదేమో! లేదా ఏ ఫేమిలీనన్నా విడదీశానేమో! అందుకనే నా భార్య నన్ను వదిలేసింది" బాధగా అన్నాడు రాంబాబు. ఆ మాట అంటున్నప్పుడు లైటు వెలుగులో రాంబాబు కళ్ళల్లో రెండు కన్నీటి ముత్యాలు మెరిశాయి.




చటర్జీ చలించిపోయాడు.

"ఛ! ఛ! బాధపడకు రాంబాబు! అనవసరంగా నీ భార్య విషయం నీ దగ్గర ఎత్తి నీకు మనస్తాపం కలిగించినందుకు నన్ను క్షమించు.

అయాం సారీ!" అన్నాడు చటర్జీ నొచ్చుకుంటూ.

"ఇట్సాల్‌రైట్" అనేశాడు రాంబాబు తేలిగ్గా.

* * *

ఫస్ట్‌షో సినిమా కెళ్లాడు రాంబాబు.

పిక్చర్ బిగినయింది.

చీకట్లో తోసుకుంటూ వచ్చి రాంబాబు ప్రక్కనే కూర్చుంది ఓ స్త్రీమూర్తి.

రాంబాబు ఆమెని చూశాడు. తెరమీద పడుతున్న ఫోకస్ వెలుగులో ఆమె ముఖం చంద్రబింబంలా కళకళలాడిపోతుంది. ఎర్రటి యాపిల్ పండులా నవనవలాడిపోతుంది ఆమె శరీరం. రాంబాబు ఆమె అందం చూసి కళ్లు తిప్పుకోలేకపోయాడు. ఆ సమయంలో ఆ స్త్రీ కూడా రాంబాబు ముఖంలో తొంగిచూసింది. రాంబాబు తడబాటుపడి మళ్లీ తెరమీదికి తిప్పుకున్నాడు.

ఆమె నెమ్మదిగా రాంబాబు చేతిమీద చెయ్యేసింది.

అంతే!

రాంబాబు నరాలు వేడెక్కాయి. ఆమె కళ్లలోకి చూశాడు. ఆమె అందంగా నవ్వింది. ఆమె ముత్యాల్లాంటి పళ్లు వరుస తళుక్కుమంది. అతడు కూడా నెమ్మదిగా ఆమె చేతిమీద చేయివేశాడు. మరుసెకనులోనే ఆమె చేతివేళ్లు రాంబాబు శరీరాన్ని తడుముతున్నాయి.

సినిమా ఎప్పుడు అయిపోతుందో కాస్ వాళ్లకు తెలీదు.

ఇద్దరు బయటకు వచ్చారు.

"లాడ్జికి వెళదామా?" అడిగాడు రాంబాబు.

"వద్దు, మా ఇంటికే వెళదాం. నా మొగుడు నిన్నే ఊరెళ్లాడు, రేపటిదాకా రాడు" చెప్పిందామె.

ఇద్దరూ ఆటోనెక్కి ఆమె ఇంటికి వెళ్లారు. దారిలో ఆమె తనపేరు సుష్మ అని చెప్పింది. రాంబాబు కూడా తనపేరు ఆమెకు చెప్పాడు. అర్ధరాత్రి పన్నెండు గంటల దాకా ఆమె అతనికి స్వర్గం చూపించింది. "ఇప్పుడిలా చేయడం నీ మొగుడికి ద్రోహం చేసినట్టు కాదా!?" అడిగాడు రాంబాబు.

"నా భర్త నన్ను సరిగా తృప్తి పరచలేడు. అందుకే ఆయన ఆఫీసుకు, ఊళ్లకు, వెళుతున్నప్పుడు నాకిష్టమైన మగాడిని ఇంటికి రప్పించుకుంటాను" చెప్పిందామె.

"దొంగతనం, రంకుతనం దాగవంటారు. ఎప్పటికైనా నీ మొగుడికి తెలిస్తే ప్రమాదం కదూ!"

"అలాంటి సమయాల్లో నన్ను చితకతంతాడే తప్ప నన్ను తగిలెయ్యడు. ఎందుకంటే నా మొగుడికి సమాజంలో కావలసింది పరువు ప్రతిష్ఠలు. వాడు నన్నొదిలేస్తే, పెళ్లాం వదిలేసిందని వాడిని వేలెత్తి చూపిస్తారని వాడి భయం." "వాడి పేరేంటి? ఎక్కడ పని చేస్తున్నాడు?" అడిగాడు రాంబాబు.

ఆమె తనభర్త పేరు చెప్పి, అతడెక్కడ పనిచేస్తాడో చెప్పింది.

అది విని రాంబాబు ఆశ్చర్యపోయాడు.

"అదిగో వాడే నామొగుడు" అంది గోడకు వేలాడుతున్న ఫోటో చూపిస్తూ.

అంతే!

ఆ ఫోటో చూసి రాంబాబు మరింత ఆశ్చర్యపోయాడు.

సరిగ్గా ఆ సమయంలో బెడ్‌రూము తలుపులు కొద్దిగా తెరుచుకున్నాయి. అందులోంచి లోపలికి రెండు కళ్లు తొంగిచూశాయి.

అంతే

ఆ కళ్లలో ప్రతీకారం, పగ కనిపించాయి. వెను వెంటనే ఆకారం తిరిగి వెళ్లిపోయింది.

రాంబాబూ, సుష్మ–వాళ్లిద్దరూ మైకంలో పడి తలుపు గడియవేయడం మరిచిపోయారు. అందుకే ఆ ఆకారం బెడ్‌రూము దాకా వచ్చి వాళ్లిద్దరినీ పసిగట్టి వెనుదిరిగి చీకట్లో కలసిపోయింది.

* * *

మర్నాడు రాంబాబూ నైట్‌డ్యూటీ ఎక్కాడు.

డ్యూటీ యధావిధిగా చేసుకున్నాడు.

గేటుబయటికి వచ్చి స్కూటర్ స్టార్ట్ చెయ్యబోతే అది స్టార్ట్ కాలేదు. ఎంతప్రయత్నించినా అదిమొరాయించింది తప్ప ఇంజన్ స్టార్ట్ కాలేదు.

చటర్జీ కూడా రాంబాబు బండి దగ్గరకొచ్చి చూశాడు.

"రాంబాబూ! ఈ రోజు నిన్ను నా బండిమీద డ్రాప్ చేస్తాను! రా! తరువాత మెకానిక్‌ని పిలిచి నీ బండి బాగుచేయించుకుందువుగాని" అన్నాడు చటర్జీ.

రాంబాబుకి కూడా అంతకంటే గత్యంతరంలేదు మరి! కాని నిజానికి రాంబాబు బండి పెట్రోల్ ట్యాంక్‌లో చటర్జీ అంతకు ముందే ఇసుకపోశాడు అని రాంబాబుకి తెలియదు.

చటర్జీ స్కూటర్ స్టార్ట్ చేశాడు. రాంబాబు చటర్జీ వెనుక కూర్చున్నాడు.

బండి ముందుకు దూకింది.

"రాంబాబు మొన్నరాత్రి నువ్వేంచేశావో నాకు తెలిసిపోయింది" అన్నాడు చటర్జీ.

అతనలా అనేసరికి రాంబాబు గతుక్కుమన్నాడు. ఒళ్లంతా చెమటలు పట్టాయి.

అయితే మొన్నరాత్రి సుష్మతో గడపడం వీడికెలా తెలిసింది? సుష్మ చెప్పిందా లేకా వాడే చూశాడా!?

ఆశ్చర్యపోయాడు రాంబాబు.

"మొన్నరాత్రి సుష్మతో నువ్వు గడపడం నేను కళ్లారా చూశాను. ఊరెళ్లిన నేను ఆ రాత్రే ఇంటికి తిరిగి వచ్చాను" స్కూటర్ వేగం పెంచుతూ అన్నాడు చటర్జీ.

"అయామ్ వేరీ వేరీ సారీ చటర్జీ! సుష్మ ఎవరో నాకు తెలియకముందే అది జరిగిపోయింది. నన్ను క్షమించు" నొచ్చుకుంటూ అన్నాడు రాంబాబు.

"ఎలా క్షమించమంటావు రాంబాబు!? నేను ఇంతటితో నిన్నొదిలిస్తే సుష్మ గురించి మన కొలీగ్స్ అందరికీ చెప్పవన్న నమ్మకమేమిటి?" అడిగాడు చటర్జీ.

"నేను నీకు మాటిస్తున్నాను చటర్జీ! ఈ రహస్యం నా గుండెల్లోనే దాచుకుంటాను. జీవితాంతం ఈ విషయం ఎవ్వరికీ ఎప్పుడూ చెప్పను. నన్ను నమ్ము" నచ్చచెప్పబోయాడు రాంబాబు.

"నో!" గట్టిగా అరిచాడు చటర్జీ స్కూటర్ వేగం పెంచుతూ.

"అయినా వాళ్లకి చెప్పడానికి నువ్వు బ్రతికుంటే కదా? అందుకే నీ బండిలో పెట్రోల్ ట్యాంకులో ఇసుకపోసి నిన్ను నా బండి ఎక్కేలా చేశాను. స్కూటర్ స్పీడు ఇంకాబాగా పెంచేశాడు చటర్జీ.

"స్కూటర్ మరీ అలా వేగంగా నడపకు, స్లో చెయ్యి! ప్లీజ్!" భయంగా అంటూనే "నువ్వు నష్టం చేస్తావు! చంపేస్తావా?" మరింత భయంగా అడిగాడు రాంబాబు.

"నోడౌట్! నా ఫేమిలీ విషయం నీకు తెలిసిపోయింది. నువ్వీ విషయాన్ని ఎవ్వరికీ చెప్పవన్న నమ్మకం నాకు లేదు. నువ్వు నాభార్యతో తిరిగే వాళ్లలోలో పైవాడివైతే అసలు పట్టించుకోను. కాని సహోద్యోగివి. ఈ విషయం నువ్వు ఎప్పటికైనా మన మిగతా గార్డులకి చెప్పవన్న నమ్మకం నాకు లేదు. అందుకనే నిన్ను చంపేస్తాను. ఈ స్కూటర్ని ఏ లారీకో గుద్దించేస్తాను" స్కూటర్ వేగాన్ని తగ్గించకుండా తాపీగా అన్నాడు చటర్జీ.

"చటర్జీ! ప్లీజ్! అంతపని చెయ్యకు. నువ్వు స్కూటర్ని ఏ లారీకో గుద్దించేస్తే నేనేకాదు.... నువ్వుకూడా చచ్చిపోతావు? ఆలోచించు" మృత్యు భయంతో వేడుకున్నాడు రాంబాబు.

చటర్జీ వికృతంగా నవ్వాడు.

చటర్జీ ఇంకా ఇంకా స్కూటర్ వేగాన్ని పెంచేశాడు.

ఎదురుగా లారీ వస్తోంది.

తనని చంపొద్దని రాంబాబు భయంగా కేకలు వేస్తూనే వున్నాడు.

అంతే!

చటర్జీ తిన్నగా స్కూటర్ని తీసుకెళ్లి లారీకి గుద్దించేశాడు. రాంబాబు "అమ్మో" అంటూ గావుకేక పెట్టాడు.

అంతే!.......

'కథ అయిపోయిందా?" అడిగాడు దేశ్‌పాండే.

'కథ అసహజంగానే వుంది"! అన్నాడు సింహప్రసాద్.

"ఎవరి ప్రాణం వాడికి తీపి కదా! మరి చటర్జీ రాంబాబుని యాక్సిడెంట్ చేసి చంపడం కాకుండా తనుకూడా ఎలా చంపుకున్నాడు?" రాజశేఖర్ గుప్తా అడిగాడు.

"ఈ కథ అసహజమైనది కాదు నిజంగానే జరిగిన కథ. సమాజంలో కొంతమంది వ్యక్తులు తమ ఉనికి ఇతరులకు తెలిస్తే భరించలేరు. ప్రాణాలకు తెగించి తమ ఉనికి తెలిసిన వ్యక్తులనే కాకుండా తమని తాము కూడా అంతం చేసుకుంటారు.

"లారీకి స్కూటర్ గుద్దించగానే చటర్జీ అక్కడికక్కడే చనిపోయాడు. కానీ రాంబాబు అదృష్టం బాగుంది. అతడికి కేవలం కాలుమాత్రమే నుజ్జయిపోయింది. అంతే! అతడు బ్రతికిపోయాడు. అతని కాలు పూర్తిగా విరిగిపోడంతో కంపెనీ అతడికి ఆఫీసు తరఫున రావలసిన రాయితీలన్నీ ఇప్పించి ఉద్యోగం లోంచి తీసేసింది. ఇప్పటికీ రాంబాబు బ్రతికే వున్నాడు" అని చెప్పాడు రామమోహనరావు.

"ఈజిట్" ఆ ముగ్గురూ ఆశ్చర్యపోయారు.

"ఆ రాంబాబుని ఓసారి చూపిస్తావా" అడిగాడు సింహప్రసాద్.

"ష్యూర్! కథలో సస్పెన్స్ కోసం పాత్రలను, ఫ్యాక్టరీ గార్డులుగా మీకు చెప్పానంతే! నిజానికి వాళ్ళు సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్లు, ఇంతకీ ఆ రాంబాబు ఎవరో కాదు..... నేనే ఆ రాంబాబుని" పోయిన తన మొండి కాలు వంక బాధ చూసుకుంటూ అన్నాడు రామమోహనరావు.

అంతే!

ఆ ముగ్గురు రిటైర్డ్ ఆఫీసర్లకి తాగిన మత్తు ఒక్క సెకనులో దిగిపోయింది. కళ్ళలో నీళ్లు తిరుగుతుండగా దిగ్భ్రాంతిగా, బాధగా రామమోహనరావునే చూస్తుండిపోయారు.

●

